


'కారు' ఓటమికి కారణాలెన్నో!

అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల్లో అంతర్మథనం మొదలైంది. వీరి ఓటమికి అనేక కారణాలున్నాయి. 10లో▸



గొల్లఘాట్‌కు మట్టిరోడ్డే దిక్కు

భీంపూర్ మండలంలోని గొల్లఘాట్ గిరిజన గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. మట్టి రోడ్డుపైనే ప్రయాణం చేస్తూ గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
26.0/21.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల జల్లులు పడే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

పంచాయతీ సమస్యలపై దృష్టి సారించాలి



వర్మీకంపోస్ట్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

నార్నూర్: గ్రామ పంచాయతీ సమస్యలపై ప్రత్యేక సారించాలని డీఎల్‌పీవో భిక్షపతిగౌడ్ అన్నారు. మండలంలోని తాడిహత్నూర్, మాన్కాపూర్, గంగాపూర్ పంచాయతీలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. తడిపొడి చెత్త సేకరణను పరిశీలించారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ, పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే వర్మీకంపోస్టు తయారీపై దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ గంగాసింగ్, పంచాయతీ కార్యదర్శులు లవ్‌కుమార్, శేఖర్ తదితరులున్నారు.

'కేంద్రీయ'లో ఉపాధ్యాయులుగా ఎంపిక

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో శిక్షణ పొందిన ఏడుగురు కేంద్రీయ విద్యాలయాల్లో ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏ.రవీందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. రాథోడ్ శ్రీకాంత్, ఆత్రం విజ్ఞానిక, రాథోడ్ సౌజన్య, మనీషా దారుండే, సంధ్య, ఆత్రం పవన్, రాథోడ్ ఆర్తీ కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించినట్లుగా పేర్కొన్నారు.

ఎన్నికల కోడ్‌కు నేటితో తెర

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం విధించిన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు మంగళవారంతో తెరపడనుంది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సీఈసీ అక్టోబర్ 9న నోటిఫికేషన్ ప్రకటించింది. ఆ రోజు నుంచే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చింది. దీంతో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు నిలిచిపోగా పాలన వ్యవహారాలు నామమాత్రంగా మారాయి. ఆయా శాఖల యంత్రాంగమంతా ఎన్నికల నిర్వహణలోనే నిమగ్నమైంది. తాజాగా ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో అందుకు సంబంధించిన కోడ్ రద్దు కానుంది. ఫలితంగా పాలన వ్యవహారాలు ఎప్పటిలాగే సాధారణం కానున్నాయి.

'ఓడినా.. ప్రజల మధ్యనే ఉంటాం'



మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

కైలాస్‌నగర్: నియోజకవర్గంలో తమ పార్టీ అభ్యర్థి ఓడినప్పటికీ, ప్రజల మధ్యనే ఉంటూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు వారికి అందేలా కృషి చేస్తామని డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకుడు బాలురి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజాసేవ భవన్‌లో నిర్వహించిన సోమవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి ఈ ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ నైతికంగా తామే గెలిచామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అధికారమిచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో నాయకులు సామ రూపేష్‌రెడ్డి, రవి, లింగన్న, మన్సూర్, రాజ్ మహమ్మద్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న నర్సింగ్

ఎదలాపురం: కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ నిరంతరం కృషి చేస్తుందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగేల నర్సింగ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా రిమ్స్ ఆసుపత్రి బ్రాంచ్ ఐఎన్‌టీయూసీ అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నారు. ప్రతిఒక్కరూ ఐక్యమత్యంగా పనిచేసి సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. అధ్యక్షుడిగా గోపు మహేందర్, సెక్రటరీగా శ్రీనివాస్, కోశాధికారిగా ఉల్లాస్‌తో పాటు తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి



తీరు మారేనా..!?

- వైద్యుల పనివేళలపై ఎన్‌ఎంసీ నిబంధన
- డ్యూటీ సమయంలో ప్రాక్టీస్ చేయవద్దు
- హెల్త్ యూనివర్సిటీ ఆదేశాలు
- 'రిమ్స్'లో మార్పు వచ్చేనా...

ఆదిలాబాద్‌టౌన్: వైద్యో నారాయణో హరి.. వైద్యుడు దేవుడితో సమానమని అంటారు. అయితే కొంతమంది తీరు వల్ల ఆ వృత్తికి కలంకం ఏర్పడుతుంది. ప్రతి నెలా రూ.లక్షల్లో వేతనాలు పొందుతున్నా విధుల్లో కొందరు అలసత్వం ప్రదర్శిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ చేసినా.. ఉన్నతాధికారులు హెచ్చరించినా సదరు వైద్యుల తీరులో మాత్రం మార్పు రావడం లేదు. బయోమెట్రిక్ హాజరు అమలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా వాటిని సైతం బురిడీ కొట్టించి ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తూ అదనపు సంపాదనపై దృష్టి సారిస్తున్నారు. ఫలితంగా సర్కారు ఆసుపత్రులపైనే ఆధార పడుతున్న నిరుపేదలకు వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందని పరిస్థితి. దీంతో వారు ప్రైవేట్ ఆసుపత్రుల బాట పడుతూ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. కాగా ప్రభుత్వ వైద్య కళాశాల్లో పనిచేసే వైద్యులు పనివేళల్లో ప్రైవేట్ ప్రాక్టీస్ చేయవద్దని పేర్కొంటూ శుక్రవారం కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆదేశాలు జారీచేసింది. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రాక్టీస్ చేయవద్దంటూ జాతీయ హెల్త్ కమిషన్ మార్గదర్శకాలకనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

సర్కారు డ్యూటీ.. ప్రైవేట్ ప్రాక్టీస్

ఆదిలాబాద్ వెనుకబడిన జిల్లాకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రిమ్స్ వైద్య కళాశాల మంజూరు చేశారు. 2008 నుంచి ఈ కళాశాలలో వైద్య విద్య బోధనతో పాటు వైద్యసేవలు ప్రారంభించారు. దాదాపు రిమ్స్‌లో 200 మంది వైద్యులు పనిచేస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు వీరు విధిగా రిమ్స్‌లో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. మధ్యాహ్న భోజన సమయంలోనూ ఆసుపత్రిలోనే ఉండాలి. వీరి భోజనం కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. అయితే అక్కడ ఎంతమంది భోజనం చేస్తారో ఎవరికి అంతుపట్టని విషయం. ఒక్కో వైద్యునికి ఒక రోజు భోజనం కోసం రూ.80 నుంచి రూ.100వరకు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ డబ్బులు సైతం తీసుకుంటారనే ఆరోపణలు లేకపోలేదు. ఈ విషయాన్ని పక్కన పెడితే రిమ్స్‌లో పనిచేసే చాలా మంది వైద్యులు సమయ పాలన పాటించరు. దర్జాగా పది గంటల వరకు ఒక్కొక్కరు ఆసుపత్రికి చేరుకుంటారు. మధ్యాహ్నం 12 దాటిందంటే ఇంటి బాట పడుతుంటారు. మధ్యాహ్న సమయంలో ఆసుపత్రి అంతా వైద్యుల్లేక ఖాళీగానే దర్శనమిస్తోంది. అయితే ఎవరినైనా ఉన్నతాధికారులు హెచ్చరిస్తే వీరు కూడా మానేస్తారనే ఉద్దేశంతో వారు చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇదే అదునుగా భావిస్తున్న పలువురు వైద్యులు తమ ప్రైవేట్ క్లీనిక్‌లు, ఆసుపత్రుల్లో ప్రాక్టీస్ చేస్తున్నారు. ఫలితంగా రిమ్స్ వైద్యంపైనే ఆధారపడ్డ రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందని పరిస్థితి.

ఆదేశాలు అమలయ్యేనా...

ప్రభుత్వ వైద్య కళాశాలలో పనిచేస్తున్న వైద్యులు సాయంత్రం 4గంటల వరకు ఎలాంటి ప్రైవేట్ ప్రాక్టీస్ చేయవద్దని కాళోజీ నారాయణరావు హెల్త్ వర్సిటీ మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది. ఇలాంటి ఉత్తర్వులు కొత్తేమీ కాకపోయినప్పటికీ పరిస్థితుల్లో మార్పు తీసుకురావాలని నిర్ణయించింది. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎలాంటి ప్రాక్టీస్ చేయవద్దని ఒక వేళ నిబంధనలు ఉల్లంఘిస్తే వారి రిజిస్ట్రేషన్ నంబర్‌ను తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ నుంచి తొలగిస్తామని హెచ్చరించింది. అయితే ఈ హెచ్చరికలకు వారు తలొగ్గి పనిచేస్తారా లేక షరా మామూలే అన్నచందంగా వ్యవహరిస్తారా అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. గతంలో పలుమార్లు కలెక్టర్లు, డీఎంఈ, మంత్రులు ఆదేశాలు జారీచేసినా పెడచెవిన పెడుతూ చాలా మంది వైద్యులు ప్రైవేట్ ప్రాక్టీస్‌కే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం నుంచి రూ. లక్షల వేతనాలు పొందుతూనే ప్రైవేట్‌లోనూ ఆర్జిస్తున్నారు.

నాణ్యమైన వైద్యమందిస్తున్నాం

రోగులకు ఇబ్బందులు కలుగకుండా రిమ్స్‌లో వైద్యసేవలు అందిస్తున్నాం. హెల్త్ యూనివర్సిటీ నుంచి ఆదేశాలు అందాయి. వైద్యులు, హెచ్‌వోడీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఈ ఆదేశాలపై సూచనలు చేస్తాం. రోగులకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే నా దృష్టికి తీసుకురావాలి. రిమ్స్‌లో నిబంధనల మేరకు వైద్యులు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.

– డా.జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

మోడల్ స్కూల్ సందర్శించిన జాయింట్ డైరెక్టర్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జేడీ


బోథ్: జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ సరోజిని సోమవారం సందర్శించారు. పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో టెన్త్, ఇంటర్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆమె వెంట బంగారుగూడ, కుంటాల, నార్నూర్, జైనథ్, బోథ్ మోడల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు సుధారాణి, శ్రీనివాస్ ప్రసాద్, చిన్నపరెడ్డి, జావీద్, ఉమేష్ ఉన్నారు.

కష్టపడి చదవాలి



పాఠశాలను సందర్శించిన డీఈవో ప్రణీత

తలమడుగు: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదవాలని డీఈవో ప్రణీత అన్నారు. మండలంలోని ఖోడద్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆమె సందర్శించారు. ఉపాధ్యాయులను సిలబస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున బాగా చది వి మంచి గ్రేడ్ సాధించాలని విద్యార్థులకు సూ చించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వారి వెంట సెక్టోరియల్ అధికారి నారాయణ, ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అంచనాలు తలకిందులు

- ఎన్నికల ఫలితాలపై ప్రధాన పార్టీల్లో అంతర్మథనం
- ఓటరు తీర్పుపై పోస్టుమార్టం

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి. ఆదిలాబాద్ నియోజకవర్గంలో అధికార బీఆర్ఎస్‌కు షాకిస్తూ బీజేపీ విజయం సాధించగా, బోథ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ తన సిట్టింగ్ స్థానాన్ని తిరిగి నిలుపుకుంది. అయితే ఆయా నియోజకవర్గాల్లో ఓటమి పాలైన ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల ఫలితాలపై విశ్లేషణలు చేపట్టాయి. పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్ల జాబితా ముందేసుకుని తాము ఎక్కడ ఫెయిల్ అయ్యామనే దానిపై నాయకులు పోస్టుమార్టం షురూ చేశారు. ఓట్లను రాబట్టుకోవడంలో అంచనాలు ఎక్కడ తప్పాయో దానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

బూత్‌ల వారీగా ఓట్లపై అంతర్మథనం

ఆదిలాబాద్‌లో ఓటమి పాలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బోథ్ నియోజకవర్గంలో పరాజయం చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు, నాయకులు ఎన్నికల ఫలితాలపై పోస్టుమార్టం చేస్తున్నాయి. పోలింగ్ కేంద్రాల వారీగా వచ్చిన ఓట్లను పరిశీలిస్తున్నారు. ఫలానా గ్రామంలో తమకు మెజార్టీ వస్తుందని భావించిన నాయకులకు ఓటర్లు షాకిస్తూ ఇతర పార్టీలకు అండగా నిలువడంపై ఆలోచనలో పడ్డారు. ఆయా చోట్ల తమకు ఓట్లు ఎందుకు తగ్గాయి, ప్రత్యర్థి పార్టీకి ఏ విధంగా పెరిగాయనే దానిపై సమాచారం సేకరిస్తున్నారు. అయితే ఆయా పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు క్షేత్రస్థాయిలో సక్రమంగా పనిచేయకపోవడం, పోల్‌మేనేజ్‌మెంట్‌లో వైఫల్యంతోనే తాము గెలుపునకు దూరమవ్వాల్సి వస్తోందని నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఆయా పార్టీలకు సంబంధించిన ముఖ్య నాయకులున్న చోట కూడా పార్టీ ఓట్లపరంగా వెనుకబడి పోవడటానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు మండలాల్లోనూ ఇదే ప్రక్రియ కొనసాగుతుండడం చూస్తుంటే ఓటరు నాడీని అందుకోవడంలో ఆయా పార్టీలు అంతగా సఫలీకృతం కానట్లుగా స్పష్టమవుతోంది.

ఓటరు పల్స్ పట్టడంలో విఫలం...

ఆదిలాబాద్ నియోజకవర్గంలో నాలుగు గ్రామీణ, ఆదిలాబాద్ అర్బన్‌తో కలిపి ఐదు మండలాలున్నాయి. అలాగే బోథ్ నియోజకవర్గంలో తొమ్మిది మండలాలు ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల్లో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రధాన పార్టీల అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేసి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఓటర్లు సైతం ఆయా పార్టీలన్నింటికీ జై కొట్టారు. బీజేపీ తరఫున ఆదిలాబాద్ నియోజకవర్గంలో కేంద్ర మంత్రి అమిత్‌షా, మహారాష్ట్ర సీఎం ఏక్ నాథ్ షిండే, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ప్రచారానికి రాగా, కాంగ్రెస్ తరఫున పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్, బోథ్‌లో జరిగిన బహిరంగ సభలకు హాజరయ్యారు. బీఆర్ఎస్ తరఫున మంత్రి హరీశ్‌రావు ఆదిలాబాద్‌లో జరిగిన బహిరంగ సభకు హాజరుకాగా, సీఎం కేసీఆర్ ఆదిలాబాద్, ఇచ్చోడలో జరిగిన బహిరంగ సభలకు హాజరయ్యారు. ఈ సభలన్నింటికీ జనం ఆయా పార్టీల నాయకులు ఆశించినదానికంటే ఎక్కువగానే వచ్చారు. ర్యాలీలకు సైతం పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో అభ్యర్థులు గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేశారు. అయితే ఆ స్థాయిలో ఓట్లను రాబట్టుకోలేకపోయామనే అభిప్రాయాన్ని నాయకులు వ్యక్తం చేస్తున్నారు.

పీఎస్సార్‌కు మంత్రి పదవి?

- పోటీలో ఉన్న 'గడ్డం' సోదరులు
- కొత్త కేబినెట్‌లో చోటుపై చర్చ
- ఆశల పల్లకిలో సీనియర్ నాయకులు



పీఎస్సార్



వివేక్



వినోద్



వెడ్మ బొజ్జు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తెలంగాణ రాష్ట్ర మూడో శాసనసభలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మంత్రి పదవి ఎవరిని వరిస్తుందోనని నాయకులు ఆశల పల్లకిలో ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరనున్న తరుణంలో కొత్త మంత్రివర్గం ఏర్పాటు కానుంది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికి చోటు దక్కుతుందోనని సర్వత్రా ఆసక్తి మొదలైంది. ఈ మేరకు సీనియర్ నాయకుల ఎంపిక కోసం కసరత్తు జరుగుతోంది. సోమవారం సాయంత్రమే సీఎల్పీ నేత ఎన్నిక, కొత్త ముఖ్యమంత్రి, మంత్రులు ప్రమాణ స్వీకారం ఉంటుందని అంతా భావించారు. చివరికి సీఎం ఎంపికపై ఇంకా ఏకాభిప్రాయం కుదరకపోవడంతో జాప్యం జరుగుతోంది. కొత్త సర్కారులో ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి ఎవరు ప్రాతినిధ్యం వహిస్తారనేది తేలాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మల్ నుంచి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఆదిలాబాద్ నుంచి జోగు రామన్న మంత్రులుగా ప్రాతినిధ్యం వహించారు. ఆ సమయంలో పశ్చిమ జిల్లా నుంచే ఇద్దరికి అవకాశం వచ్చింది. కేబినెట్ హోదా ఉన్న ప్రభుత్వ విప్ పోస్టు మాత్రం తూర్పు జిల్లాకు ఇచ్చారు. ఈసారి పశ్చిమ జిల్లా నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ లేరు. మంచిర్యాల జిల్లా పరిధిలోనే ముగ్గురు ఎమ్మెల్యేలు, ఖానాపూర్ పరిధిలో మరొకరు ఉన్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ గెలిచిన స్థానాలైన మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, ఖానాపూర్ ఎమ్మెల్యేలకే కొత్త కేబినేట్‌లో చోటు దక్కనుంది. ఉమ్మడి జిల్లా నుంచే ఇద్దరిని మంత్రులుగా ఎంపిక చేస్తే 'గడ్డం' సోదరుల్లో ఒకరు, మరొకరు పీఎస్సార్ ఉండనున్నారు.

పోటీలో 'గడ్డం' బ్రదర్స్

నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఇద్దరు గడ్డం సోదరులైన వినోద్, వివేక్ మంత్రి రేసులో ఉన్నారు. వీరిలో ఒకరికి వచ్చే అవకాశాలు ఉన్నాయని అనుచరులు చెప్పుకుంటున్నారు. చెన్నూరు నుంచి 2004 నుంచి 2009మధ్య దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రభుత్వంలో గడ్డం వినోద్ మంత్రిగా పని చేశారు. తాజాగా వినోద్ బెల్లంపల్లి నుంచి ఎన్నికయ్యారు. వివేక్ తొలిసారిగా చెన్నూరు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గతంలో పెద్దపల్లి నుంచి ఎంపీగా పని చేశారు.

పీఎస్సార్‌వైపు మొగ్గు?

టీపీసీసీ ఎన్నికల వ్యూహ రచన కమిటీ చైర్మన్‌గా ఉన్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పార్టీ పరిశీలనలో ఉండనున్నారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ అధికారంలో లేనప్పుడు కష్టకాలంలో వెన్నంటే ఉండి బలోపేతం చేశారు. మంచిర్యాల జిల్లాతోపాటు పది నియోజకవర్గాల్లోనూ ఆయనకు పట్టు ఉంది. ఈ క్రమంలో పార్టీ పీఎస్సార్ పేరును ప్రధానంగా పరిశీలన చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో కేబినెట్ బెర్త్ ఖాయమని ఆయన వర్గీయులు విశ్వాసంగా ఉన్నారు. ఇక ఖానాపూర్ స్థానం నుంచి ఎన్నికైన ఆదివాసీ నాయకుడు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు మంత్రి పదవిపై ఆశలు ఉన్నాయి.

ఆదిలాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- అభివృద్ధికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్
- సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా..
- కేంద్ర, రాష్ట్ర నిధులు తీసుకువస్తా..
- ఎమ్మెల్యే పాయల్ శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల పాలనలో ఆదివాసీ గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో బీఆర్ఎస్ విఫలమైందన్నారు. అధికారంలో ఉన్న ఆ పార్టీ ఎన్నికల్లో డబ్బులు వెదజల్లిందని ఆరోపించారు. కోడ్ నిబంధనలు ఉల్లంఘించి బీజేపీ నాయకులు, కార్యకర్తలను బెదిరింపులకు గురిచేసిందన్నారు. అలాగే లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందవనే భయానక వాతావరణం సృష్టించిందని విమర్శించారు. అయితే ప్రజలు వారి మాటలు నమ్మకుండా తనకు అవకాశం కల్పించారన్నారు. నా విజయం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరున ధన్యవాదాలు తెలుపుతున్నారన్నారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం, ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వే లైన్, రిమ్స్ సూపర్ స్పెషాలిటీలోని సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నియోజకవర్గ ప్రగతికి సంబంధించిన నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం గ్రామాలు, వార్డుల వారీగా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందిస్తామన్నారు. తన విజయాన్ని ఆదిలాబాద్ ప్రజలకు అంకితం చేస్తున్నానని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వకులాభరణం ఆదినాథ్, అంకత్ రమేశ్, నగేష్, రవి, లాలామున్నా, ప్రవీణ్ రెడ్డి, దినేష్ మటోలియా, రత్నాకర్ రెడ్డి, విజయ్, కృష్ణయాదవ్, మయూర్ చంద్ర తదితరులున్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ



ఎమ్మెల్యేను అభినందిస్తున్న రాథోడ్ బాపూరావు



ఎమ్మెల్యేకు విగ్రహాన్ని అందజేస్తున్న రవి

ఆదిలాబాద్: ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన పాయల్ శంకర్‌కు సోమవారం అభినందనలు వెల్లువెత్తాయి. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆయనను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన ఎగిడి రవి అనే కళాకారుడు ఎమ్మెల్యే విగ్రహాన్ని మట్టితో తయారుచేసి ఆయనకు అందించి తన అభిమానాన్ని చాటుకున్నారు. పట్టణ ప్రముఖులు, పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు తరలిరావడంతో కార్యాలయం సందడిగా కనిపించింది.

క్లుప్తంగా

రేపు జోనల్ స్థాయి రగ్బీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈనెల 6న ఎస్జీఎఫ్ అండర్ 14 జోనల్ స్థాయి రగ్బీ (ఉమ్మడి జిల్లా) ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన క్రీడాకారులు బుధవారం ఉదయం 9.30 గంటలకు పీఈటీ భూమన్నకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

6న ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక..

ఆదిలాబాద్: ఈనెల 6వ తేదిన మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో అండర్ 14 బాలబాలికల ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి (ఉమ్మడి జిల్లా) బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతోందని ఎస్జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన క్రీడాకారులు పోటీలు ఆర్గనైజర్ ఫ్రాన్సిస్‌కు మైదానంలో బుధవారం ఉదయం 10 గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

అండర్ 17 క్రికెట్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులు

నిర్మల్‌చైన్‌గేట్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన అండర్ 17 క్రికెట్ పోటీల ఎంపికకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు లక్కీ క్రికెట్ అకాడమీ కోచ్ సుదర్శన్ తెలిపారు. వీరు ఈ నెల 5 నుంచి 8వరకు గజ్వేల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని ఎస్జీఎఫ్ సెక్రటరీ రమణారావు, పీఈటీ భూమన్న అభినందించారు.

'ఓపెన్' పది, ఇంటర్ ఫలితాలు విడుదల

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్ స్కూల్ పది, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలైనట్లు డీఈఓ టి.ప్రణీత ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది అక్టోబర్ 16వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నిర్వహించిన పరీక్ష ఫలితాలు www.telanganopenschool.org వెబ్‌సైట్‌లో ఉంచినట్లుగా తెలిపా రు. ఈ వెబ్‌సైట్‌లో ఉంచిన మార్క్ మెమోల్లో ఎమైనా పొరపాట్లు ఉంటే సంబంధిత అధ్యాయన కేంద్రాల ప్రధానోపాధ్యాయులు, ఏఐ కోఆర్డినేటర్ల ద్వారా ఈ నెల 21వ తేదీ వరకు తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం హైదరాబాద్ వారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గడువు అనంతరం ఎలాంటి పొరపాట్లు సరిచేయడం జరుగదన్నారు.

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ...

పదో తరగతి రీ కౌంటింగ్‌కు పేపర్‌కు రూ. 350, ఇంటర్మీడియట్ పేపర్‌కు రూ.400 , రీ వెరిఫికేషన్‌కు పదో తరగతి, ఇంటర్మీడియట్‌కు పేపర్‌కు రూ.1200 చొప్పున ఈ నెల 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు మీ సేవ ద్వారా ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె సూచించారు.






ధర్మసాగర్ చెరువు చుట్టూ ఆస్పత్రుల వ్యర్థాలు

కంపు కొడుతున్న చెరువులు

నిర్మల్ నడిబొడ్డునున్న కంచెరోని, ధర్మసాగర్ చెరువు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి కంపు కొడుతోంది. ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు, స్థానికులు దుర్గంధం భరించలేకపోతున్నారు. బల్దియా అధికారులు పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ దుర్గంధంతో స్థానికులు రోగాల బారీన పడే అవకాశం ఉందని వాపోతున్నారు. సమస్య తీర్చాలని వేడుకుంటున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

పార్టీ మారే... పదవి వరించే

- ఉమ్మడి జిల్లాలో పలువురిని వరించిన అదృష్టం
- అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపు



సిర్పూర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన పాల్వాయి హరీష్‌బాబు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కోనేరు కొనప్పపై 3043 ఓట్ల అధిక్యంతో విజయం సాధించారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన ఆయన 2018 ఎన్నికల్లో అదే పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. తాజాగా కాంగ్రెస్‌ను వీడి బీజేపీ తరపున పోటీ చేసిన ఆయన కొనప్పను ఓడించి తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు.

కైలాస్‌నగర్: రాజకీయంలో ఎమ్మెల్యే, ఎంపీ పదవులు ఎప్పుడు ఎవరిని వరిస్తాయనేది చెప్పలేం. ఒక్కొక్కరు ఏళ్లుగా ఎంతో కష్టపడినప్పటికీ వారికి ఎలాంటి పదవులు దక్కవు. కానీ కొంతమందికి కష్టపడాల్సిన అవసరం లేకుండానే అదృష్టం వరిస్తోంది. రాజకీయంగానూ పదవులు వారి సొంతమవుతాయి. ఇలాంటి కోవకే చెందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలువురు నాయకులను ఎమ్మెల్యే పదవి వరించింది. ఏళ్లుగా ఒక పార్టీలో కొనసాగి సీనియర్లుగా ముద్రపడడంతో పాటు ఆ పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన నాయకులకు కండువా మార్పు ఈ ఎన్నికల్లో కలిసి వచ్చింది. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీలు మారిన నాయకులకు ప్రజలు మద్దతుగా నిలిచారు. వారిని ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించారు. ఆదివారం వెల్లడైన ఎన్నికల ఫలితాల్లో ముగ్గురు నాయకులు ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. వారేవరనేదాన్ని పరిశీలిస్తే...



నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు. ఆ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా సేవలందించారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా నిర్మల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. పార్టీలో ఏర్పడ్డ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఏప్రిల్ 23న కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. అదే నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆయన మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిపై 50,703 ఓట్ల అధిక్యంతో విజయం సాధించి రెండోసారి అసెంబ్లీకి వెళ్లనున్నారు.



ఈ నెల 3వ తేదీన ప్రకటించిన ఫలితాల్లో ముధోల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన పవార్ రామారావు పాటిల్ సైతం కాంగ్రెస్‌లో కొనసాగారు. ఆ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగానూ సేవలందించారు. గతేడాది నవంబర్ 22వ తేదీన కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరాడు. పార్టీలో తన కంటూ గుర్తింపు తెచ్చుకోవడంతో పాటు ప్రజల్లోనూ పలుకుబడిని సంపాదించుకున్నాడు. బీజేపీ అభ్యర్థి గా పోటీ చేసిన ఆయన స్థానిక ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డిపై 23,419 ఓట్ల అధిక్యంతో విజయం సాధించి తొలిసారి అసెంబ్లీలోకి అడుగిడుతున్నారు.



కాంగ్రెస్ పార్టీ నుంచి పెద్దపల్లి ఎంపీగా పనిచేసిన జి. వివేక్ వెంకటస్వామి అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆ పార్టీలో జరిగిన పరిణామాలతో ఆ పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఆ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఉన్నటువంటి ఆయన ఈ ఏడాది నవంబర్ 1వ తేదీన అనూహ్యంగా బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీ తరఫున చెన్నూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన తన ప్రత్యర్థి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై 36,618 ఓట్ల అధిక్యంతో విజయం సాధించి తొలిసారిగా అసెంబ్లీకి వెళ్లనున్నారు.

సోషల్ మీడియా... సైలెంట్

- ఎన్నికల ప్రక్రియపూర్తి
- సామాజిక మాధ్యమాలు నిశ్శబ్దం...

నిర్మల్‌ఖిల్లా: గత నెల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి జిల్లాలో ఉధృతంగా కొనసాగిన ప్రచారంతో పాటు సామాజిక మాధ్యమాల్లో కూడా ముమ్మరంగా ప్రచార భేరి మోగించారు. సోషల్ మీడియా ఇన్‌చార్జిలను నియమించి మరీ జిల్లాలోని ప్రధాన పార్టీలన్నీ మేనిఫెస్టోలు, అభ్యర్థుల గుణగణాలను విస్తృతంగా ప్రచారం చేశారు. కార్యక్రమాల వివరాలను వాట్సాప్, పేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్ వంటి మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేస్తూ బిజీబిజీగా గడిపారు. అయితే ఆదివారం ఫలితాలు తేటతెల్లం కావడంతో సోషల్ మీడియా స్తబ్దుగా మారింది. ఇన్ని రోజులు ప్రధాన రాజకీయ పార్టీల సోషల్ మీడియాల ఇన్‌చార్జిలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడం, కామెంట్ల రూపంలో వాదనలు కొనసాగడం జరిగాయి. ఒకరు పెట్టిన సోషల్ మీడియా పోస్టుకు ప్రత్యర్థి పార్టీల అనుచరులు స్పందిస్తూ విమర్శల రూపంలో కామెంట్లు చేసుకున్నారు. దానికి మళ్లీ ప్రతిస్పందనలు రావడం ఇలా వాద, ప్రతివాదనలు సోషల్ మీడియాలో జోరుగా కొనసాగాయి. ఫలితాలు వెల్లడి అనంతరం ఓటమి చెందిన అభ్యర్థుల అనుచర వర్గం సైలెంట్ అయిపోయింది. గెలిచిన అభ్యర్థుల అనుచరులు విజయ యాత్రల పేరిట ఆదివారం రాత్రి వరకు పలు ప్రాంతాల్లో డీజేల మోతలు మోగించారు. గెలిచినా, ఓడినా హుందాగా ఉండడమే బెటరని తటస్థులు సూచిస్తున్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని వాటిని ప్రతిష్టాత్మకంగా తీసుకొని అనుచరులు, కార్యకర్తలు, యువత వివాదాలు సృష్టించుకోవద్దని కోరుతున్నారు.

ప్రజల హృదయాలను గెలుచుకున్నావు..

- కేటీఆర్‌ను కలిసిన జాన్సన్ నాయక్


కేటీఆర్‌తో జాన్సన్‌నాయక్

ఉట్నూర్‌రూరల్: రాజకీయాల్లో గెలుపోటములు సహజమని ఎన్నికల్లో ఓడిపోయిన ఖానాపూర్ ప్రజల హృదయాలను గెలుచుకున్నావని ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్‌ను కేటీఆర్ అభినందించారు. జాన్సన్‌నాయక్ సోమవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. దీంతో కేటీఆర్ ఎన్నికల సరళిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో మంచి ఓట్లు సాధించి ప్రజల హృదయాలను గెలుచుకున్నావని కొనియాడారు. ఓటమితో అసంతృప్తి చెందకుండా రానున్న రోజుల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు.

మంత్రివర్గంలో వివేక్‌కు చోటు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రజ్ఞాకుమార్

ఆదిలాబాద్‌రూరల్: మాల, మాల ఉపకుల సామాజిక వర్గం నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన గడ్డం వివేక్‌కు గతంలో ఎంపీగా చేసిన అనుభవం ఉందని, మంత్రివర్గ విస్తరణలో చోటుకల్పించాలని భారతీయ బౌద్ధ మహాసభ ఉత్తర తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞాకుమార్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మహా ప్రజ్ఞా బుద్ధ వీహార్ ప్రాంగణంలో భారతీయ బౌద్ధ మహాసభ, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ, మాల యువసేన అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీల అభివృద్ధికి కృషి చేస్తుందని నమ్ముతున్నామన్నారు. ఈ సమావేశంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా యూత్ అధ్యక్షులు మస్కే రాజు, మాల యువసేన జిల్లా అధ్యక్షులు ఆర్ ఉదయ్ కుమార్, సంఘమిత్ర వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి పటాడే రాజు, వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, నాయకులు సుఖదేవ్, సురేష్, బోరేకర్ నందు కుమార్, మూడే ప్రమోద్, ఆర్ విశ్వనాథ్, తాడే రాహుల్, జాడే సిద్ధార్థ, వసంత్ ఉన్నారు.

ముల్లు కర్రల తయారీతో ఉపాధి


ముల్లు కర్రలను తయారు చేస్తున్న ఇబ్రహీం

ఇచ్చోడ: మంలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన ఇబ్రహీం ముల్లు కర్రలు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఇచ్చోడ మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే పశువుల సంతలో అతడు తయారు చేసిన ముల్లు కర్రలను విక్రయిస్తుంటాడు. ఒక్క కర్రకు రూ.50 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నట్లు తెలిపాడు. ప్రతివారం రూ.15వందల నుంచి 2వేల వరకు సంపాదిస్తున్నట్లు పేర్కొంటున్నాడు. వెదురుకర్రలతో తయారు చేసే వీటిని వ్యవసాయదారులు ఎక్కువగా కొనుగోళ్లు చేస్తుంటారని తెలిపాడు.

సీఎల్పీ సమావేశానికి బొజ్జు


సమావేశంలో వెడ్మ బొజ్జు

కడెం: హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని ఎల్లా హోటల్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సీఎల్పీ సమావేశానికి ఖానాపూర్ నియోజవర్గ ఎమ్మెల్యేగా గెలిచిన వెడ్మ బొజ్జు హాజరయ్యారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మానిక్‌రావుఠాక్రే, డి.కే శివకుమార్, గెలిచిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు హాజరైనట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల బాహాబాహీ


దూషించుకుంటున్న కాంగ్రెస్ వర్గీయులు

- ఎమ్మెల్యే వినోద్ జన్మదిన వేడుకల్లో ఘర్షణ

బెల్లంపల్లి: ఎమ్మెల్యే గడ్డం వినోద్ జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ శ్రేణులు బాహాబాహీకి దిగిన ఘటన సోమవారం బెల్లంపల్లిలో చోటుచేసుకుంది. కేక్ కట్ చేసే క్రమంలో ఇరువురు నాయకుల మధ్య మనస్పర్థలు వచ్చి కార్యకర్తల ముందే దూషించుకున్నారు. ఒకరినొకరు తోపులాడుకుని తన్నుకునే వరకు వెళ్లారు. బెల్లంపల్లి ఎమ్మెల్యేగా వినోద్ గెలిచి 24గంటలు కూడా గడవక ముందే కాంగ్రెస్ నాయకులు ఆధిపత్యం కోసం తగువులాడుకోవడం పురప్రజలను తీవ్ర విస్మయానికి గురిచేసింది. పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో ఎమ్మెల్యే వినోద్ జన్మదిన వేడుకలను ఏర్పాటు చేశారు. ముందుగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య కేక్ కట్ చేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికి మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు వచ్చారు. అప్పటికే జన్మదిన వేడుకలు పూర్తి కావడంతో సూరిబాబు వర్గీయులు మరో కేక్‌ను తీసుకొచ్చి కట్ చేసేందుకు సిద్ధపడ్డారు. అంతలోనే మల్లయ్య ముందుకు దూసుకొచ్చి కాంగ్రెస్ కార్యాలయంలో ఒకసారి మాత్రమే కేక్ కట్ చేయాలని, రెండోసారి వేడుకలను నిర్వహించవద్దని సూరిబాబు వర్గీయులను వారించి కేక్‌ను కిందకు తోసేయడంతో గొడవ ప్రారంభమైంది. సూరిబాబు, మల్లయ్యలు పరుష పదజాలంతో దూషించుకుని ఒకరినొకరు నెట్టేసుకున్నారు. ఈ క్రమంలో కార్యకర్తలు రెండు వర్గాలుగా విడిపోయి బాహాబాహీకి దిగారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అంతలోనే మల్లయ్య అక్కడి నుంచి వెళ్లిపోగా ఆ తర్వాత సూరిబాబు వర్గీయులు కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు సమాచారం ఇవ్వకుండా పట్టణ అధ్యక్షుడు మల్లయ్య ఏకపక్షంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను నిర్వహించడం ఏమిటని సూరిబాబు వర్గీయులు పేర్కొన్నారు. మల్లయ్య తీరు ఏమాత్రం సరిగా లేదని పలువురు కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు జైలు

భైంసాటౌన్: భార్య ఆత్మహత్యకు కారణమైన కేసులో భర్తకు జైలుశిక్ష విధిస్తూ నిర్మల్ జిల్లా కోర్టు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.అజేశ్ కుమార్ సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలిలా ఉన్నాయి.. భైంసా పట్టణంలోని ఓవైసీనగర్‌కు చెందిన బబ్లూ ఖురేషి మద్యానికి బానిసై భార్య అక్బరిబేగంను తరచూ కొట్టేవాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై 2021లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై సాదిక్‌హుస్సేన్ కేసు నమోదు చేశాడు. సోమవారం కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార జైలుశిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

యువకుడి ఆత్మహత్య


ముత్యం(ఫైల్)

లోకేశ్వరం: ఇంటి నుంచి వెళ్లిపోయిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం వెలుగుచూసింది. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం... మండలంలోని పంచగుడి గ్రామానికి చెందిన పంగిర ముత్యం (27) గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ముత్యం ఆచూకీ కోసం కుటుంబ సభ్యుల బంధువుల వద్ద చుట్టు పక్కల గ్రామాల్లో వెతికారు. సోమవారం పంచగుడి వంతెన వద్ద ముత్యం మృతదేహం లభించింది. ముత్యం అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నాడు. తనకు సోకిన జబ్బు నయం కావడం లేదని మనస్తాపానికి గురై గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ముత్యం ఏడేళ్లుగా మలేషియాలో ఉపాధి కోసం వెళ్లి తిరిగి సెప్టెంబర్‌లో స్వగ్రామానికి వచ్చాడు. అప్పటి నుంచి సోకిన జబ్బు విషయమై మనోవేదనకు గురయ్యేవాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

యువతి ఆత్మహత్య

చింతలమానెపల్లి: పురుగుల మందుతాగి యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో యాదవ్ వివరాల ప్రకారం... మండలంలోని రవీంద్రనగర్ గ్రామానికి చెందిన ఊర్మిళ మండల్(21) 10వ తరగతి పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటోంది. ఈ నెల 2న తల్లిదండ్రులు వ్యవసాయ పనుల కోసం ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇల్లు అస్తవ్యస్తంగా ఉండడంతో తండ్రి కేనార్ మండల్ కూతుర్ని మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన ఊర్మిళ పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఈస్‌గాం తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొనసాగుతున్న జాతర



జైనథ్: మండల కేంద్రంలోని అతి ప్రాచీన శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో జాతర కొనసాగుతోంది. స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా కళ్యాణోత్సవ, రథోత్సవ వేడుకలు ఇటీవల ఘనంగా నిర్వహించారు. కాగా ప్రస్తుతం కొనసాగుతున్న జాతర కోసం జిల్లా నలుమూల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు పెద్ద ఎత్తున విచ్చేస్తున్నారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని, రథానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. జాతరలో చిన్నారులు, మహిళలు ఆటవస్తువులు, అలంకరణ సామాగ్రి కొనుగోలు చేస్తూ సందడి చేస్తున్నారు.

